సు'రక్షిత' గమ్యమే ధ్యేయంగా..

- ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం
- ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు

మదనపల్లె సిటీ : రాష్ట్ర వ్యాప్తంగా నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తోంది ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ. సంస్థకు కీలకమైన స్థానం బస్సును నడిపే డ్రైవర్లదే. మదనపల్లెలో 1,2 ఆర్టీసీ డిపోలున్నాయి. ఇందులో సుమారు 300 మందికిపైగా డ్రైవర్లు, కండక్టర్లు పని చేస్తున్నారు. వారిలో కొందరు డ్రైవర్లు దశాబ్దాల పాటు విధులు నిర్వహిస్తూ ఎటువంటి ప్రమాదాలు లేకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చారు. డ్రైవర్లను గుర్తించిన యాజమాన్యం ఇటీవల జరిగిన ఆర్టీసీ రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సత్కరించి గౌరవించారు. వారిలో మదనపల్లె 2 డిపో నుంచి ఎస్.అన్వర్‌బాషా, ఎం.ఎం.నాయక్, ఎస్.నజీర్‌బాషా, వన్ డిపో నుంచి ఎస్.ఏ.పీర్, జీఎంవి రమణలు డ్రైవర్లు ఉత్తమ డ్రైవర్లుగా బహుమతులు పొందారు.



ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్నాం



డ్రైవర్లకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్నాం. కుటుంబ సభ్యులతో ఎలా ఉండాలి. విధి నిర్వహణలో ఎలా ఉండాలనే విషయాలు తెలియజేస్తున్నాం. డ్రైవింగ్ మెలకువలు చెబుతున్నాం. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నాం.అందుకే ఆర్టీసీలో సుక్షితులైన డ్రైవర్లు ఉన్నారు.
– మూరే వెంకటరమణారెడ్డి, డీఎం, మదనపల్లె

• దురలవాట్లకు దూరంగా ఉండాలి



సుమారు 30 ఏళ్లగా ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తున్నా. డ్రైవర్‌కు ఎటువంటి దురలవాట్లు ఉండరాదు. డ్యూటీ అయిపోయిన వెంటనే ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంటాను. బయట తిరగకుండా కుటుంబంతో ఎక్కువ సమమయం గడుపుతాను. డ్యూటీకి అరగంట ముందే వెళ్లి బస్సును శుభ్రం చేయించుకుంటాను. తనిఖీ చేసుకొన్న తర్వాతే రోడ్డుపైకి వస్తాను. ముఖ్యంగా డ్రైవరుకు ముత్తుపదార్థాలు సేవించే అలవాటు ఉండకూడదన్నదే నా అభిప్రాయం. రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా అధికారుల నుంచి బహుమతి అందుదకోవడం ఆనందంగా ఉంది.
– అన్సర్‌బాషా, డ్రైవర్, ఆర్టీసీ టు డిపో,మదనపల్లె

• క్రమశిక్షణతో విధులు



30 ఏళ్లగా ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తున్నా. విధుల్లో ఉన్నప్పుడు మనసులో ఎటువంటి ఆలోచనలు ఉండకూడదు. ఆర్టీసీలో చేరినప్పటి నుంచి క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నా. డ్రైవింగ్ చేసేటప్పుడు పక్కచూపులు ఉండరాదు. కుటుంబ సమస్యలు ఎన్ని ఉన్నా ఇంటి వద్దే వదిలేయాలి. డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఎదుటి వాహనాలు గమనించాలి. రద్దీ ప్రదేశాలు,ట్రాఫిక్, ప్రమాదకర మలుపులు వచ్చినప్పుడు మరింత జాగ్రత్త వహించాలి. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో సంస్థ ఉన్నతాధికారుల నుంచి బహుమతి అందుకోవడం సంతోషంగా ఉంది.
– ఎం.ఎం.నాయక్, డ్రైవర్ ఆర్టీసీ టు డిపో, మదనపల్లె

• విధిగా నియమాలు పాటించాలి



ప్రతి డ్రైవరు విధులకు హాజరైన తర్వాత కేవలం డ్రైవింగ్‌పైనే ధ్యాస ఉంచాలి. ఇతర వ్యాపకాలను వదిలేసి మనసును ఏకాగ్రతతో ఉంచుకొని విధులు నిర్వహించాలి. రోడ్లపైకి రకరకాల మనస్తత్వాలు కలిగిన వారు వస్తుంటారు. పరిస్థితులను తగ్గట్టుగా మనం నడిపే వాహనాన్ని ఆధీనంలో ఉంచుకోవాలి. ఎట్టి పరిస్థితుల్లో ట్రాఫిక్ నియమాలు విస్మరించకూడదు. రోడ్డుపై నడిచే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో బహుమతి అందుకోవడం మరిచిపోలేని అనుభూతి.
– నజీర్‌బాషా, డ్రైవర్, టు డిపో,మదనపల్లె

• కుటుంబ సభ్యులుగా భావిస్తా



వాహనంలో ఎక్కిన ప్రయాణికులందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తాను. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతా. బస్సు ఎక్కగానే మదిలోకి ఎటువంటి ఆలోచనలు రాకుండా ఏకాగ్రతతో వాహనాన్ని నడిపి ప్రయాణికులు బస్సు దిగగానే ఊపిరిపీల్చుకుంటాను. ప్రమాదకూడళుల ఉన్న చోట ముందుగా గమనించి అప్రమత్తంగా ఉంటాను. 30 ఏళ్లగా ఎటువంటి ప్రమాదం ఎరగను. ఉత్తమ అవార్డు తీసుకోవడం ఆనందంగా ఉంది.
– ఎస్.ఏ.పీర్, డ్రైవర్, వన్ డిపో, మదనపల్లె

నేటి నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున వెలసిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అంకురార్పణతో మొదలై 10 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. 6న హనుమంత వాహనం, 7న సింహ వాహనం, 8న శేష వాహనం, 9న గజ వాహనం, 10న గరుడ వాహనం, 11న స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 12న అశ్వ వాహనం, పార్వేటి గ్రామోత్సవం, 13న వసంతోత్సవం, సుదర్శన చక్రస్నానం, 14న శయనోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

అధికవడ్డీతో సహకార బంధు పథకం

బి.కొత్తకోట: సహకార బ్యాంకులో అధికవడ్డీ చెల్లించే సహకార బంధు పథకం అమలవుతోందని స్థానిక డీసీసీబీ మేనేజర్ శివారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈనెల 20 వరకు కొనసాగే ఈ పథకం ద్వారా డిపాజిట్ చేసే సొమ్ముకు 7.70 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్స్‌కు 8.54 శాతం వడ్డీ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రూ.వెయ్యి నుంచి డిపాజిట్ స్వీకరిస్తామని, డిపాజిట్లకు డీఐసీజీసీ బీమా రక్షణ ఉంటుందని తెలిపారు. ఇతరా వాణిజ్య బ్యాంకుల కంటే అధికంగా వడ్డీ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రజలు సహకార బ్యాంకులో డిపాజిట్లు చేయాలని కోరారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

7న షబేబరాత్ పండుగ

మదనపల్లె సిటీ: ముస్లింలు షబేబరత్ పండుగను ఈనెల 7న జరుపుకోవాలని ప్రభుత్వ సర్‌ఖాజీ ఇక్బాల్ అహ్మద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు తమ పూర్వీకుల ఆత్మలకు శాంతి ప్రాప్తి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

నేడు కరాటే చాంపియన్‌షిప్ పోటీలు

పీలేరురూరల్ : పీలేరు పట్టణ శివారు ప్రాంతం మొరవపల్లెలోని శ్రీవారి (ఎస్‌వీఆర్) కల్యాణ మండపంలో కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించనున్నట్లు యోదా మాస్టర్ ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఎస్.ఎ. సతీష్ తెలిపారు. ఆసక్తిగల్గిన వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని చెప్పారు. వివరాలకు 7997226077 నెంబరను సంప్రదించాలన్నారు.

విద్యాలయం చుట్టూ మంటలు

బి.కొత్తకోట: స్థానిక ఆదర్శ విద్యాలయం చుట్టూ మంటలు వ్యాపించడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురైన ఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. ఆదర్శ విద్యాలయం పక్కనే గుట్ట, ఆ గుట్టపై హాస్టల్ ఉంది. విద్యాలయంలో తరగతులు నిర్వహిస్తున్న సమయంలో చుట్టూ మంటలు వ్యాపించడంతో ప్రిన్సిపాల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ బొజ్జేనాయక్ చేరుకుని మంటలను స్థానికులతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది కొద్దిపాటి మంటలను ఆర్పేశారు.

వరకట్నం వేధింపులపై కేసు

కలికిరి: అదనపు కట్నం కోసం మహిళను వేధించిన ఘటనలో అత్తింటి వారిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ పూల మనోహర్ తెలిపారు. వివరాలిలా.. మండలంలోని మేడికుర్తి గ్రామం సన్యాసివారిపల్లికి చెందిన షేక్ సాకీరాకు గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన షేక్ సయ్యద్ బాషాతో ఏడాది క్రితం వివాహం జరిగింది. వివాహమైన కొద్ది రోజులకే భర్త, అత్తమామ, బావ తదితరుల నుంచి వరకట్న వేధింపులు మొదలయ్యాయి. పెద్దలు చెప్పినా వేధింపులు ఆగక పోవడంతో పుట్టింటికి చేరుకున్న సాకీరా శనివారం కలికిరి పోలీసులను కలిసి న్యాయం చేయాలని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, అత్త, మామ, బావ, మరో వ్యక్తి మొత్తం ఐదురుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కమ్మచెరువు పంచాయతీ గారచెట్లపల్లికి చెందిన చిక్కప్ప (38) అకస్మికంగా మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సర్పంచ్ చెరువు నరసమ్మ, ఉప సర్పంచ్ బాబురెడ్డి, కార్యదర్శి మంజు, డీఏ లక్ష్మణ్‌లు మృతుడి భార్య లక్ష్మీదేవికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సాయంగా రూ.10 వేల నగదును అందజేశారు.

ఎమ్మెల్యే నివాళి

వాల్మీకిపురం: పట్టణంలోని చాకలవీధికి చెందిన రజక సంఘం నాయకుడు వెంకటస్వామి(73) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చాకలవీధిలోని మృతుడి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుమారుడు బాలాజీని పరామర్శించి, సానుభూతి తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మల్లెల ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 8వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల వాసి మంజునాథ్ విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేసారు. సర్పంచ్ శ్రీకంఠరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ కవిత, హెచ్ఎం సుధాకర్‌తో పాటు ఉపాధ్యాయులు దాతను కొనియాడారు.

ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకోవాలి

పెద్దమండ్యం: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు వెళ్లాలని జిల్లా టూరిజం అధికారి, మోడల్ పాఠశాల ప్రత్యేక అధికారి నాగభూషణం అన్నారు. మోడల్ పాఠశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవం, పదవతరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం జరిగింది. పాఠశాల ప్రిన్సిపల్ రామాంజులునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీటీఓ మాట్లాడుతూ విద్యతో ప్రతి ఒక్కరూ విజ్ఞానాన్ని పొందుతారని పేర్కొన్నారు. క్రమశిక్షణతో ఎదిగే విద్యార్థి ఉన్నత స్థాయిని చేరుకుంటారని తహసీల్దార్ నిర్మలాదేవి అన్నారు.

సింహ వాహనంపై వేంకటరమణుడు



రామసముద్రం: రామసముద్రం మండలం చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సింహవాహనంపై స్వామివారు ఊరేగారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రభట్టర్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. రాత్రి స్వామివారిని గ్రామ పురవీదుల్లో వైభవంగా ఊరేగించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

పెద్దతిప్పసముద్రం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని ఎంపీపీ మహమూద్, సచివాలయ మండల కన్వీనర్ డ్రిప్ రమణలు ఓటర్లను కోరారు. శనివారం వారితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాదర్‌వలి, సుబ్బిరెడ్డి, గిరీష్, కిట్టన్న, రఘునాథ్‌రెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి తదితరులు మండలంలోని సంపతికోట, బూచిపల్లి పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. అనంతరం ఆయన గెలుపు కోసం బూచిపల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కేవీపల్లె : ఈ నెల 13న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. శనివారం మండలంలోని తిమ్మాపురం గ్రామ సచివాలయం, ప్రభుత్వ పాఠశాలల్లో కరపత్రాలు అందజేసి ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, ఏపీఐఐసీ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రదీప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

గురుల పాఠశాలను తనిఖీ చేసిన ఏడీజే

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చంద్రకాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శనివారం రెండవ అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు తనిఖీ చేశారు. హాస్టల్‌లో ఉన్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా, వైద్యులు వైద్యపరీక్షలు చేస్తున్నారా ?, సౌకర్యాల గురించి విద్యార్థులను అడిగారు.విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. పిల్లలకు ఫోక్సో చట్టం, చిల్డ్రన్స్ యాక్టు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కన్యాకుమారి, వైస్ ప్రిన్సిపాల్ నారాయణ, పారా లీగల్ వలంటీర్ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్ వంట గదిని పరిశీలిస్తున్న ఏడీజే భాస్కరరావు

చిత్తశుద్ధితో విధులు నిర్వహించండి

–డీఎల్‌డీఓ లక్ష్మీపతి

బి.కొత్తకోట: సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని మదనపల్లె డివిజన్ అభివృద్ధి అధికారి లక్ష్మీపతి కోరారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీఓ శంకరయ్యతో కలిసి బడికాయలపల్లె సచివాలయం తనిఖీ చేశారు. విధుల్లోని ఉద్యోగులతో సమావేశమై పలు అంశాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలపై దరఖాస్తులు, వాటి పరిష్కారం , ప్రజలకు అందిస్తున్న సేవలు, ఫిర్యాదులపై సమీక్షించారు. అనంతరం బద్దిపల్లె లేఅవుట్‌లో పేదలు నిర్మించుకొంటున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగపద్మజ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

కేవీపల్లె : రాబోవు పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కన్వీనర్ దుద్దు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కలిపించాలనే డిమాండ్‌తో చిత్తూరు నుంచి విజయవాడకు చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర 7వ రోజు శనివారం మండలంలోని కొండకిందపల్లె, మూల హరిజనవాడ, రాళ్లహరిజనవాడ, బాటవారిపల్లె, సర్వోదయనగర్, గుండ్రేవారిపల్లె క్రాస్, ఎగువమేకలవారిపల్లె, దిగువమేకలవారిపల్లె, అగ్గివారిపల్లె, సరస్వతినగర్, తువ్వపల్లె వరకు చేరుకుంది. ఆయా గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ నాయకులకు స్వాగతం పలికారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అవుతున్నా ఎస్సీ వర్గీకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించి మాట తప్పిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ నాయకులు ప్రకాష్, ప్రేమ్‌కుమార్, వెంకటాచలపతి, శ్రీరాములు, ఆంజనేయులు, యల్లేశ్వర, విశ్వనాథ, శ్రీనివాసులు, రామచంద్రయ్య రమణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో క్షతగాత్రులను రక్షించాలి

నిమ్మనపల్లె: ప్రమాదాల బారిన పడి ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వ్యక్తులను అందుబాటులో ఉన్న వారు రక్షించాలని మదనపల్లె డీఎస్పీ కేశప్ప అన్నారు. ఇటీవల మండలంలోని రాచవేటివారిపల్లె గ్రామానికి చెందిన సురేంద్రరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణపాయస్థితిలో ఉండగా, కాపాడిన డ్రైవర్ వెంకటరమణను నిమ్మనపల్లె పోలీసుస్టేషన్‌లో సన్మానించారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న గుడ్‌సుమిత్రన్ అవార్డు కింద రూ.5000 నగదును అందజేశారు. మార్చి 1న సురేంద్రరెడ్డిని రాచవేటివారిపల్లె సమీపంలో లగేజ్ వాహనం ఢీకొనగా తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటువైపుగా మదనపల్లెకు చెందిన వెంకటరమణ తన బొలెరో వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాణప్రాయస్థితి నుంచి రక్షించారు. సన్మానం అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలు తమ కళ్ల ఎదుట జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలన్నారు.

వేగంగా బ్లూకోల్ట్స్ సేవలు

మదనపల్లె: నూతన వాహనాలతో బ్లూకోల్ట్స్ సేవలు మరింత వేగంగా ప్రజలకు అందుతాయని డీఎస్పీ కేశప్ప అన్నారు. శనివారం స్థానిక టు టౌన్ పోలీసుస్టేషన్‌లో పోలీసుస్టేషన్‌కు మంజూరైన నూతన బ్లూకోల్ట్స్ వాహనాలను సిఐ మురళీకృష్ణతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. వన్, టు, తాలూకా పోలీసుస్టేషన్‌ల నుంచి 24 గంటల షిఫ్టుల వారీగా బ్లూకోల్ట్స్ పోలీసులు పని చేస్తారన్నారు. గొడవలు, ఘర్షణలు, ప్రమాదాలు జరిగిన సమయంలో మరింత వేగంగా, సమాచారం అందిన వెంటనే వారు సంఘటన స్థలానికి చేరుకుంటారన్నారు. 8 వాహనాలు మంజూరు చేశారన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి

నియోజకవర్గ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ

గుర్రంకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి గోపాలకృష్ణ అన్నారు. మండలకేంద్రమైన గుర్రంకొండలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. స్థానిక తెలుగు జెడ్పీహైస్కూల్లో రెండు ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో శనివారం ఆయన జెడ్పీహైస్కూల్‌కు చేరుకొని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన గదులను పరిశీలించారు. అందులో ఉన్న సౌకర్యాలు, ఇంకా ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై అధికారులకు సూచనలిచ్చారు ఆయనవెంట తహసీల్దార్ ఖాజాబీ, డీటీ శ్రీనివాసరావ్, వీఆర్వో అన్వర్‌లు పాల్గొన్నారు.

యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో సోఫియా

మదనపల్లె సిటీ: కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్–2023 ఫెస్టివల్‌లో మదనపల్లె పట్టణం జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో బీకాం ఫైనల్ ఇయర్ విద్యార్థిని సోఫియా మెహజబిన్ పాల్గొంది. దేశవ్యాప్తంగా 87 మంది విద్యార్థులు ఎంపిక చేయగా, అందులో మదనపల్లెకు చెందిన సోఫియా ఎంపికైంది. ఈనెల 1,2 తేదీల్లో న్యూఢిల్లీ పార్లమెంట్ సెంట్రల్‌హాలులో స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా అధ్యక్షతన వహించిన యూత్ పార్లమెంటులో పాల్గొని అక్కడ నిర్వహించిన పలు అంశాల్లో పాలుపంచుకుంది. స్వయంగా ఎంపీలు కూర్చునే సీటులో కూర్చున్న సోఫియా తన అనుభూతిని పంచుకుంది. శనివారం కాలేజీలో సోఫియాను కాలేజ్ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవిలు అభినందించారు.

ఇద్దరు నాటుసారా విక్రేతలు అరెస్ట్

కలకడ: ఇద్దరు సారా విక్రేతలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 40 లీటర్ల నాటు సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కోన గ్రామంలో శనివారం పచ్చిపాల కృష్ణమ నాయుడు, వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లెకు చెందిన చిరంజీవి కలిసి నాటుసారా విక్రయించడానికి సిద్ధపడ్డారు. గ్రామానికి సమీపంలో విక్రయించడానికి ప్రయతిస్తుండగా ఎంసీసీ టీమ్ ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నారాయణ తమ సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొన్నారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్లో అప్పగించడంతో ఎస్ఐ తిప్పేస్వామి వారిపై కేసు నమోదు చేశారు.

ముదివేడు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కురబలకోట: మండలంలోని ముదివేడు అంగన్వాడీ కేంద్రాన్ని శనివారం డీపీఓ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలు బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. పిల్లల హాజరును పరిశీలించారు. పౌష్టిక ఆహారం గురించి విచారించారు. వంటలను రుచి చూసి మరింత నాణ్యతగా వడ్డించాలన్నారు. రక్తహీనతను అధిగమించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో అంగన్వాడీలో పిల్లలను విడిచి వెళతారన్నారు. వారిని కంటికి రెప్పలా చూసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

– డీపీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్

వాల్మీకిపురం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ పోషన్ మిత్ర కార్యక్రమంలో భాగంగా షాంధాసిని ఫౌండేషన్ సహకారంతో ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని మొదటి దశలో గుర్తించి సరైన వైద్య సేవలతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని నయం చేయవచ్చునన్నారు. మదనపల్లికి చెందిన ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ స్వాతి ఆధ్వర్యంలో ప్రతి నెలా 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు ఉచితంగా పౌష్టికాహారాన్ని అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్లు లేఖ్య, సనా ఆయేషా, గురుస్వామి, హర్షిత రెడ్డి, టిబి యూనిట్ వైద్య సిబ్బంది మురళి, నాగిరెడ్డి, సీహెచ్ఓలు ప్రత్యూష, అశ్విని, అమృత, మౌనిక, గంగరత్న, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



పౌష్టికాహారం అందిస్తున్న డీసీహెచ్ఎస్ చంద్రశేఖర్

మదనపల్లె: టీబీ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మాంజలిదేవి అన్నారు. శనివారం స్థానిక ఆస్పత్రిలో టీబీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ టీబీ రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ ధ్యేయంగా క్షయ విభాగ సిబ్బంది పని చేయాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు మందులతో పాటు సమతుల్యతతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ దివాకర్, హెడ్‌నర్సు, టీబీ సిబ్బంది ప్రభాకర్, సుశీల, వనజకుమారి, భవ్య, దయాలన్ తదితరులు పాల్గొన్నారు.

శిశు సంరక్షణపై ప్రత్యేక నిఘా

– డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్

పీలేరు : శిశు సంరక్షణపై తల్లి ప్రత్యక నిఘా ఉంచాలని డీపీఎంఓ (జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి) డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని రేగళ్లు, తలపుల పీహెచ్‌సీల పరిధిలోని పీలేరు పట్టణం పీఆర్‌సీ కాలనీ, బలిజ వీధి, బండ్లవంక గ్రామ సచివాలయం, కొత్తపల్లె అంగన్‌వాడీ కేంద్రాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో జ్వరం, జలుబు, నీరసం, శ్వాస తీసుకోవడం కష్టం, వాంతి చేసుకోవడం, అసాధారణ విరేచనాలు లాంటి లక్షణాలను తల్లి గమనించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఈ మహమ్మద్‌రఫీ, ఆరోగ్య పర్యవేక్షకులు కుసుమ, విజయలక్ష్మీ, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, అమ్మాజీ, ఏఎన్ఎం భార్గవి పాల్గొన్నారు.

కేవీపల్లె : అర్హత గల లబ్ధిదారులకు వ్యాధి నిరోధక టీకాలు వందశాతం పూర్తి చేయాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీల పరిధిలోని బిల్లులవారిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు.